



రాచపూటి రమేష్

# మేడిన్ చైనా

"దీని సిగదరగా! నిన్న టీవీలో బీజింగ్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవాన్ని చూశావుటోయ్ రమేషూ! కళ్లు చెదిరిపోయాయనుకో. అసలింతవరకు ఇంత వైభవంగా ఏ క్రీడా ఉత్సవాలు జరగలేదంట. ఇదంతా చైనా మహిమ. ఈరోజు ప్రపంచంలోనే చైనాకు అడ్డులేదు. ఆర్థికరంగంలో, సైన్సు, స్పోర్ట్స్... ఏ రంగం తీసుకున్నా చైనావాళ్ల ముందు తతిమా దేశాలన్నీ మట్టి కరవాల్సిందే. చూసుకో, ఏమనుకున్నావో ఏమో! నిన్న బర్డ్‌నెస్ట్ స్టేడియంలో ఆ విషయమే మరోసారి తాజాగా రుజువైంది" అన్నాడు జీలింగ్, దర్జాగా టీ సిప్ చేస్తూ.

జీలింగ్ అంటే అతనే చైనీయుడో, జపనీయుడో అని మీరు అనుకొని వుంటే పప్పులో కాలేసినట్లే. అతడు అరణాల ఆంధ్రుడు. అసలుపేరు జీలాది లింగబాబు. కాకపోతే మా లింగబాబుకి చైనా దేశమన్నా, అక్కడి ప్రజలన్నా, వారి ఆచార వ్యవహారాలన్నా విపరీతమైన అభిమానం. 'తింటే చైనీస్ ఫుడ్డే తినాలి, చూస్తే జాకీచాన్ సినిమాలే చూడాలి' అనే సిద్ధాంతం కలవాడు. అందుకే జీలాది లింగబాబు అనే తన అసలు సిసలు తెలుగు పేరును 'జీలింగ్'గా మార్చుకొని అలాగే చెలామణి అవుతూ వుంటాడు. "ఏమోయ్, లింగబాబూ" అని ఎవరు పిలిచినా తనను కానట్లే వుంటాడు.

"మిస్టర్ జీలింగ్" అంటేమాత్రం ఎగిరి గంతేసి మీ ముందుంటాడు.

"అన్నట్టొరే రమేషూ, నీకీ టీ జన్మస్థానం ఏదో, ఈ తేనీరు ఎలా పుట్టిందో ఏమైనా తెలుసా?" తన సుదీర్ఘ ఉపన్యాసానికి నాందీ ప్రస్తావనలా అడిగాడు నన్ను మళ్లీ, టీ చప్పరిస్తూ.

నాకు ఒళ్లు మండింది. ఇప్పటికి చాలాసార్లు ఈ విషయంపై మా ఆఫీసు కేంటీన్లో ఉపన్యాసం దంచాడతను. అదెవరో చైనా దేశపు రాకుమారిట, తన గార్డెన్లో చెట్టు కింద కూర్చుని పాలుతాగుతూ వుంటే, చెట్టుమీద నుండి ఓ కాయ రాలి ఆమె తాగే పాలల్లో పడిందట. దాంతో ఆ పాలకు అమోఘమైన రుచి అబ్బిందట. ఆ చెట్టును తేయాకుచెట్టుగా గుర్తించి, టీని విశ్వవ్యాప్తం చేశారట చైనీయులు. ఆ కథ మళ్లీ వినలేక నాకేదో అర్జంటు పనున్నట్లుగా చల్లగా కేంటీన్నుండి జారుకున్నాను.

అసలు జీలింగ్ రూటే సపరేటు. అతడు వాడే పెన్ను నుండి వాచీ, సెల్‌ఫోను, గాగుల్సు, బట్టలు, రేడియో, టార్చిలైటు...అన్నీ చైనాలో తయారైనవే వుండేలా జాగ్రత్త తీసుకుంటాడు.

చైనా బియ్యం షాపుల్లో విరివిగా దొరుకుతూ వున్నన్ని రోజులూ, అదే వాడమని వాళ్లింట్లో పోరుపెట్టేవాడట. పొడుగాటి ఆ బియ్యంతో చేసిన అన్నం తినలేక వాళ్ల అమ్మ, నాన్న అల్లాడిపోయేవారట. ఇప్పుడు వుద్యోగం కోసం పరాయి వూరొచ్చి, రూం తీసుకొని ఒక్కడే వుండడంతో, జీలింగ్ చేష్టలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

మధ్యాహ్నం పూట అతని కేరియర్లో ఏ న్యూడుల్సో, మంచూరియానో దర్శనమిచ్చేది. ఇక సాయంత్రం వేళల్లో ఏ చైనీస్ రెస్టారెంట్లోనో దూరి, ఖచ్చితంగా చైనా వంటకాలు లాగించాల్సిందే. "తిండి విషయంలో చైనావాళ్లను చూసి మనం చాలా నేర్చుకోవాలోయ్, చైనీస్ పీపుల్ కప్పలు, పాములు ఇలా దేన్నీ వదలకుండా తినేస్తారని మనవాళ్లంటారు. అంత జనాభా వున్న దేశంలో ఆహారపు కొరత రాకుండా వుండడానికి అదే కారణమని తెలుసుకోలేకపోయారా మీరు? మనవాళ్లు 'నాకిది పడదు, అది పడదు' అని తెగ నీలుగుతూ వుంటారు. కానీ చైనావాళ్లను చూడండి. 'కప్ప కాళ్ల నుండి కోతి మెదడు' వరకు అన్నీ శుభ్రంగా లాగించి పుష్టిగా వుంటారు. అందుకే వాళ్లకు ఒలింపిక్సులో అన్ని మెడల్సు వచ్చాయి" అని గర్వంగా అంటూ వుంటాడు జీలింగ్.

"అంతేకాదు, టీ షర్టు నుండి సెల్‌ఫోను వరకు అన్ని వస్తువులపై ఇప్పుడు చైనావాళ్లదే గుత్తాధిపత్యం వుంది. చైనా గూడ్స్ అంటే ప్రపంచవ్యాప్తంగా యువతరంలో వుండే క్రేజ్ అంత ఇంత కాదు. అందుకే టూత్‌బ్రష్ మొదలుకొని వీడియో కెమెరాల వరకు అన్నీ చైనా వస్తువులే కొంటుంటాను నేను" అని సగర్వంగా ప్రకటించుకుంటూ వుంటాడు. మూడు నెలలకొసారి చెన్నైకి వెళ్లి తనకు కావలసిన వస్తువులన్నీ సెంట్రల్ స్టేషను దగ్గరలో వున్న చైనా బజార్లో కొనుక్కుని వచ్చేవాడు. అడపాదడపా ఏ వస్తువన్నా మా వూర్లో కొనాలన్నా, షాపులన్నీ వెతికి చైనా ప్రొడక్టునే పట్టుకొచ్చేవాడు.

"వీడి దుంపతెగా, పాలు, కూరగాయలు ఇంకా చైనా నుండి రావడం లేదు కాబట్టి మనం బతికిపోయాం. లేకపోతే వాటినే వాడమని మన ప్రాణాలు తీసేవాడు" అని మా ఆఫీసు స్టాఫు లింగబాబు పరాయి దేశాభిమానాన్ని దుమ్మెత్తిపోసేవారు. 'ఏం, ఇండియాలో తయారయ్యే వస్తువులంత తీసిపోయాయా?' అని కొందరతన్ని తిట్టిపోసేవారు.

ఓసారి నేను లింగబాబుగాడి స్వంత వూరికి ఏదో పనుండి వెళ్ళాల్సి వచ్చింది. ఆ విషయం తెలుసుకున్న లింగబాబు నా దగ్గరకు వచ్చి, "నువ్వు మా వూరికి వెళ్తున్నావటగా! సాయంత్రం మీ ఇంటికొక సీడీ ప్లేయర్ తెచ్చిస్తాను. 'మేడిన్ చైనా'నేలే. కాస్త దాన్ని మా ఇంటికి చేర్చెయ్యి. పాపం మా అమ్మా, నాన్నకు మా వూళ్లో బొత్తిగా వూసుపోవడం లేదట" అన్నాడు.

నేను పని చూసుకున్న తర్వాత లింగబాబు వాళ్లింటికెళ్లి వాళ్లమ్మగారికి సీడీ ప్లేయర్నందజేశాను. నన్ను కూర్చోమని, కాఫీ కలుపుకొచ్చి నాకిచ్చింది. నేను కాఫీ తాగుతూ వుండగా తన ఆవేదన వెళ్లగక్కింది.

"ఏమిటో మా లింగబాబు ధోరణి నాకేమీ అంతుబట్టకుండా వుంది బాబూ. ఎన్ని సంబంధాలు తెచ్చినా వాడికి నచ్చడం లేదు. మంచి సంప్రదాయం గల ఇళ్లలోంచి వచ్చిన ఎందరు అందమైన అమ్మాయిల ఫోటోలు తెచ్చినా, వాడు నిమిషాల్లో తిరగ్గొట్టేస్తున్నాడు" అని వాపోయిందామె.

"ఎలాగైనా మా లింగబాబుకు చెప్పి వాడినొక ఇంటివాడ్ని చేసి పుణ్యం కట్టుకో నాయనా" అందామె నేను శెలవు తీసుకుంటుండగా. ఆ విషయంలో లింగబాబుకు గట్టి డోసే ఇవ్వదలిచాను.

"రమేషూ నీకీ విషయం తెలుసా? 2025వ సంవత్సరం నాటికి చైనా అన్నిరంగాల్లో అమెరికాను మించిపోతుందట. ఈరోజు పేపర్లో వేశారు" అన్నాడు వాడు ఆఫీసులోకి వస్తూనే.

"దానికేం భాగ్యంలే కానీ, నీకన్నా చిన్నవాళ్లు ఇప్పటికే ఇద్దరు బిడ్డల తండ్రులై నిన్ను మించిపోయారు. దానికేం జవాబు చెప్తావ్?" అన్నాను నేను కోపంగా. లింగబాబు నా ప్రశ్నకేమీ సమాధానం చెప్పలేదు. లంచ్ టైంలో వాళ్లమ్మ నాకిచ్చిన పెళ్లికూతుళ్ల ఫోటోలు, వివరాలు కొన్ని లింగబాబుకందజేసి, అర్జెంటుగా వాటిలో ఒకటి సెలక్టు చేసుకోమన్నా. కానీ ఆ టాపిక్ మాట్లాడడం తనకిష్టం లేనట్లుగా లింగబాబు "అర్జెంటు ఫైళ్లు కొన్ని చూసేవి వున్నాయి" అని అక్కడనుండి తప్పించుకున్నాడు.

ఇక లింగబాబు చేతిలో పప్పన్నంగాని, పలావుగాని తినే యోగం లేదని మేమంతా కంగారుపడుతూ వుండగా, హఠాత్తుగా ఓ రోజు లింగబాబు అమిత ఉత్సాహంగా ఆఫీసులోకి అడుగుపెట్టాడు. రెండువారాలపాటు ఆఫీసుకు శెలవుపెట్టి చెప్పాపెట్టకుండా ఏదో వూరెళ్లి హఠాత్తుగా ఆ రోజే వూడిపడ్డాడతను.

"సాయంత్రం షావోలిన్ చైనీస్ రెస్టారెంట్లో డిన్నర్ ఇస్తున్నాను. మీరంతా తప్పకుండా రావాలి" అని దర్జాగా అనౌన్స్ చేశాడు. కారణం చెప్పలేదు. "అందరూ అక్కడకు

సెవనోక్లాక్‌కంతా వచ్చెయ్యండి..పార్టీకి కారణ మేంటో అక్కడే చెప్తాను" అన్నాడు సస్పెన్సును పెంచుతున్నట్లుగా.

"లింగబాబు పెళ్లి చేసుకున్నాడా? ఐతే పెళ్లికూతురు ఎవరు? ఇందరమ్మాయిలను రిజెక్ట్ చేసిన లింగబాబు చివరికెటువంటి పిల్లను సెలక్ట్ చేసుకున్నాడో" అని గుసగుసలు పోయారు కొందరు. ఏమైనా సాయంత్రానికి మా ఉత్కంఠకు తెరదించినట్లవుతుంది.

ఠంచనుగా ఏడింటికే చైనీస్ రెస్టారెంట్లోకి అడుగుపెట్టాను నేను. ఆ సరికే మా ఆఫీసు స్టాఫంతా అక్కడే సమావేశమై వున్నారు. తన అలవాటుకు తగినట్లుగా మా ఆఫీసరు అర గంట ఆలస్యంగా వేంచేశారు.

అందరూ పిచ్చాపాటి కబుర్లలో మునిగి తేలుతూ వుండగా, హఠాత్తుగా ఒకసారి లైట్లు ఆరాయి. అవి తిరిగి వెలిగేసరికి సాంప్రదాయమైన చైనా దుస్తుల్లో వున్న ఓ సుందరి స్టేజిపై దర్శనమిచ్చింది.

ఆ సరికే ఫుల్‌సూట్‌లో వున్న లింగబాబు, "మీట్ మై వైఫ్, జాలోజియాంగ్" అని మాకు ఆ పిల్లను పరిచయం చేశాడు. చైనా దేశస్థురాలైన ఆ అమ్మాయి హైదరాబాద్‌లో ఫార్మసీ కోర్సు చదివేందుకు వచ్చిందట. ఈ మెయిల్ ద్వారా ఆ అమ్మాయితో పరిచయమేర్పరుచుకున్న లింగబాబు, తనకు గల చైనా దేశాభిమానాన్ని ఆమెముందు ఒలకబోసి తన స్నేహాన్ని పెంచుకున్నాడట. రెండేళ్లుగా వాళ్లిద్దరిమధ్యా ఛాటింగ్‌లో ఛాటర్ బాక్సులు బద్దలౌతున్నాయిట. చైనా సంప్రదాయం ప్రకారం వాళ్లిద్దరూ గాంగ్‌టాక్‌లోని ఓ బుద్ధిస్ట్ మొనాస్ట్రీలో పెళ్లి చేసుకున్నారట.

లింగబాబు దంపతులకు అక్షింతలు వేసే యోగం లేకపోయినా, గిఫ్ట్ బొకేలు అందజేసి, చైనీస్ డిషెస్‌ని కష్టం మీద కతికి మేమందరం ఇళ్లకు బయల్దేరాం.

కాపురానికి చైనావాస్తుకు అనుకూలంగా వున్న ఓ ఇల్లు తీసుకుని, మొత్తం ఫెంగ్‌షుయ్ వస్తువులతో నింపేశాడట లింగబాబు.


రెండు రోజుల తరువాత లింగబాబు వాళ్లమ్మ మా ఇంటికొచ్చి, "లింగబాబు తమకెవ్వరికీ చెప్పాపెట్టకుండా దేశంకాని దేశం పిల్లను కోడలిగా తీసుకొచ్చాడని" వాపోయింది బాధగా.

"పోనీలెండి, ఎలాగోలాగా లింగబాబు ఓ ఇంటివాడయ్యాడు. చిన్నగా ఆ అమ్మాయే మన పద్ధతులు నేర్చుకుంటుంది" అని సర్దిచెప్పాను నేను.

పెళ్లైన రెండు, మూడు నెలలపాటు లింగబాబు చాలా ఉత్సాహంగా గాల్లో తేలిపోతున్నట్లు కనిపించేవాడు. కానీ ఈమధ్య ఎందుకో చాలా డల్‌గా కనిపిస్తున్నాడు.

వారంరోజులపాటు లింగబాబు ఆఫీసుకు శెలవుపెట్టాడు. కారణం తెలియరాలేదు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి వుంది.బాత్‌రూమ్‌లో కాలుజారిపడి ఫ్రాక్చరైన మా మామయ్యను చూసిరావడానికి నేను హాస్పిటల్‌కు వెళ్లాను. ఆయనను చూసి వచ్చేటప్పుడు వార్డులో ఒంటినిండా కట్లతో బాధతో మూలుగుతున్న ఓ శాల్తీ నా కంటబడ్డాడు. ఆ ముఖం ఎక్కడో చూసినట్లు అనిపించడంతో దగ్గరగా వెళ్లి చూసిన నాకు మతిపోయినంత పనైంది. ఆ శాల్తీ ఎవరో కాదు మా లింగబాబే.

నన్నక్కడ చూస్తానని వూహించని లింగబాబు ముందు కంగారుపడ్డాడు. తరువాత ఏడుపు మొఖంతో తన బాధలను ఏకరువు పెట్టాడు.



"పెళ్లికి ముందే తాను చైనా సాంప్రదాయాలు గానీ, ఆహారపుటలవాట్లుగాని ఒదులుకొనేది లేదని కండిషన్ పెట్టింది మా ఆవిడ. నాకున్న చైనా పిచ్చితో ఆ కండిషన్స్ అన్నింటికీ ఒప్పుకున్నా! చైనా వంటకాలన్నీ కొన్నాళ్లు నా నాలిక్కి అమోఘంగానే అనిపించాయి. కానీ, రాను రాను ఆ వంటలపై నాకు మోజు చచ్చింది. వర్షాకాలం గదా, బయటకు వెళ్లి సరుకులేవీ తీసుకురాలేకపోయేవాణ్ణి కొన్నిసార్లు. అప్పుడామె ఇంటిబయట మట్టిలో వానపాములతో నూడుల్స్, కప్ప కాళ్లతో ఫ్రై చేసి నాకు వడ్డించేది. నాకా తిండి తినలేక దోకువచ్చినంత పనైంది. ఆఖరుకు ఇలా కాదని మా ఆవిడకు తెలియకుండా బయట హోటళ్లలో సుష్టుగా టిఫెన్లూ, భోజనాలూ లాగించి వచ్చేవాణ్ణి. ఇంట్లో మా ఆవిడ చూడకుండా అల్లం, గోంగూర వగైరా పచ్చళ్ల బాటిళ్లు దాచిపెట్టుకొని వంటకాల్లో వేసుకు తినేవాణ్ణి. ఇది మా జాలోజియాంగ్ ఈ వంట లంటే తన కసహ్యమని ఇంట్లో తిరిగి వాటిని చూస్తే నా పని పట్టానని వార్నింగిచ్చింది. ఆ రోజు సరేనని ఒప్పుకున్నా.

మొన్నొక రోజు బ్యూటీపార్లర్‌కు మేకప్ కోసం వెళ్లిన జాలోజియాంగ్ ఇప్పుడిప్పుడే రాదనుకొని, పెసరట్టు పార్శిల్ తెచ్చుకొని తీరిగ్గా డ్రాయింగ్ రూంలో కూర్చుని తినసాగాను. ఇంతలో అనుకోకుండా చైనీస్ డ్రాగన్‌లా వచ్చిపడింది మా ఆవిడ. చైనా వంటకాలతోపాటు చైనావారి యుద్ధవిద్యలైన కుంగ్‌ఫూ, టేక్వాండో వగైరాలు ఆమెకు కొట్టినపిండట. ఆవేశంతో నామీద దాడి చేసింది. పోలీసువాళ్ల దెబ్బల్లా పైకి కనబడని దెబ్బలతో చావబాదింది. ఆ వీరకొట్టుడుతో ఒళ్లు హూనమై హాస్పిటల్లో చేరాల్సి వచ్చింది. ఇంతవరకు నన్ను చూసేందుకు కూడా రాలేదు" అని బావురుమన్నాడు లింగబాబు.

'దెబ్బకు దెయ్యం వదిలింది. లేకపోతే పరాయిదేశంపై అంత మోజు పనికిరాదెవ్వరికీ' అనుకున్నాను లింగబాబు అవస్థ చూడలేకపోతూ.